సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం : 6 : జూన్ : 2023



పోస్టల్ సేవలపై అవగాహన

తపాలశాఖ శాఖ అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అరకు సబ్ డివిజన్ ఐపీవో ఉపేంద్ర కోరారు. 8లో



ఫోన్ కొట్టు.. సేవలు పొందు

రైతులకోసం ప్రభుత్వం మరో కార్యక్రమాని కి శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా 155251 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. 8లో



ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ

కొయ్యూరు: రంపుల ఘాట్‌లో సోమవారం టిప్పర్, ఆర్టీసీ బస్సు ఢీ కొన్నాయి. బస్ డ్రైవర్ చాకచక్యంతో పెద్ద ప్రమాదం తప్పింది.

న్యూస్‌రీల్

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎఫ్‌వో, సిబ్బంది

చింతూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ఇందుకోసం ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలని చింతూరు డీఎఫ్‌వో పుష్పసౌజన్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం చింతూరులో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని, వినియోగం మానుకోవాలని చెప్పారు. రేంజ్ ఆఫీసర్లు మోహినీ విజయలక్ష్మి, కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కూటీలు



దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేస్తున్న కలెక్టర్,ఎంపీ,ఎమ్మెల్యే,ట్రైకార్ చైర్మన్

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమశాఖ ద్వారా దివ్యాంగులకు మంజూరు చేసిన స్కూటీలను సోమవారం కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబులు పాడేరు నియోజకవర్గంలో ఆరుగురు దివ్యాంగులకు వీటిని అందజేశారు. జిల్లాలో మొత్తం 30 స్కూటీలు మంజూరయ్యాయి.ఈకార్యక్రమంలో ఎంపీటీసీ గిడ్డి విజయ లక్ష్మి,సర్పంచ్ వంతాల సీతమ్మ,వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి,సిబ్బంది అప్పలనాయుడు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

గాం గంటందొర వర్ధంతికి ఏర్పాట్లు

కొయ్యూరు: బ్రిటీష్ పాలకులను గడగడలాడించి, చివరకు బ్రిటీష్ సైన్యం చేతిలో అమరుడైన గాం గంటం దొర 99వ వర్ధంతిని బట్టపనుకుల పంచాయతీ లంకవీధిలో ఏడో తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సంబంధిత అధికారులను సోమవారం ఆదేశించారు. వర్ధంతి సందర్భంగా గంటందొర విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. పీవో ఆదేశాల మేరకు ఎంపీడీవో మేరీరోజ్, తహసీల్దారు తిరుమలరావు, ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

పేద రోగులకు మెరుగైన వైద్యమే లక్ష్యం



శివానంద్‌ను అభినందిస్తున్న అధికారులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.శివానంద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ పి.అశోక్‌బాబు అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్స నిమిత్తం సెలవు పెట్టారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రాధాకృష్ణ వ్యవహరిస్తున్నారు. తాజాగా కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శివానంద్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో(ఎఫ్ఏసీ) సూపరింటెండెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 1998లో శివానంద్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. 2012లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2017లో ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. ఆ తర్వాత ఆర్‌డీసీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, శ్రీకాకుళం స్విమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేశారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా పని చేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన శివానంద్‌ను పలువురు అభినందించారు.కేజీహెచ్‌కు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడమే తన లక్ష్యమని శివానంద్ తెలిపారు.

నేడు వాహనాల వేలం

అడ్డతీగల: కేసుల్లో పట్టుబడిన నాలుగు మోటార్ సైకిళ్లను అడ్డతీగల పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం వేలం వేయనున్నట్టు ఎస్ఐ అప్పలరాజు చెప్పారు.ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలన్నారు. వేలంలో వాహనం దక్కించుకున్న పాటదారు 18 శాతం జీఎస్టీతో సహా పాట నగదు చెల్లించాలన్నారు.

శరవేగం.. పునరావాసం

- దేవీపట్నం మండలంలో 5,618 నిర్వాసిత కుటుంబాలు
- ఆఖరి దశలో దేవీపట్నం, పూడిపల్లి పునరావాస కాలనీలు



దేవీపట్నం నిర్వాసితల కోసం గోకవరం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇళ్లు

రంపచోడవరం: దేవీపట్నం మండలంలో పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం చేపట్టిన కాలనీల నిర్మాణం దాదాపు పూర్తికావస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరం పునరావాస పనులు వేగవంతం చేశారు. నిర్వాసితులు కష్టాలు తీర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరావాసానికి తొలి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రాజెక్టుకు దగ్గరగా ఉండే దేవీపట్నం మండలంలోని 44గ్రామాల్లో నిర్వాసితులకు ముందుగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ మండలంలో 5,618 మంది నిర్వాసిత కుటుంబాలున్నాయి.

గిరిజనులకు .. : గిరిజనులకోసం ఇళ్ల నిర్మాణం, నిర్వాసితుల తరలింపు పూర్తయింది. పోతవరంలో 78, ముసుళ్లకుంటలో314, కంభలంపాలెంలో 78, ఇందుకూరు-1లో 306, ఇందుకూరు-2లో 117, పెదభీంపల్లి-1లో -268, పెదభీంపల్లి-2లో 129, గంగవరంమండలం నేలదోనెలపాడు గ్రామంలో 390 ఇళ్లు నిర్మించి, నిర్వాసితులను తరలించారు.

గిరిజనేతరులకు.. :
గిరిజనేతరులకు మూడు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మిస్తున్నారు.గోకవరం మండలం కృష్ణునిపాలెం పంచాయతీ రాజుపాలెంలో 1,076 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇప్పటికే ఇక్కడ అందరూ నివాసాలు ఏర్పర్చుకున్నారు. గోకవరం- రాజమండ్రి రహదారిలో మరికొంతమంది కోసం చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇక్కడ స్థలాలు కేటాయించిన 670 మందిలో 500 మందికి ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తోంది. 150 మంది సొంతంగా నిర్మించుకుంటున్నారు. మిగతా 20 ఇళ్ల వ్యవహారం తేలవలసి ఉంది. పూడిపల్లిలో 223 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇవి పూర్తయితే గిరిజనేతరులకు నూరు శాతం పునరావాసం కాలనీలకు తరలించినట్టు అవుతుంది.పెండింగిలిస్టులో ఉన్న 1200 మందిలో అర్హులను గుర్తించవలసి ఉంది.

ఫేక్ చలానా వ్యవహారంలో అటవీ అధికారి సస్పెన్షన్

రాజవొమ్మంగి : అక్రమంగా కలప తరలించేందుకు పచ్చజెండా ఊపుతూ ఫేక్ చలానా సృష్టించిన రాజవొమ్మంగి కార్యాలయానికి చెందిన అటవీశాఖ అధికారి సత్యనారాయణను రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర శర్మ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆదేశాలు అందాయని స్థానిక అటవీ శాఖ క్షేత్ర అధికారి అబ్బాయిదొర సోమవారం విలేకరులకు తెలిపారు. గత నెల 23న అడ్డతీగల అటవీ క్షేత్రంలోని కల్లుమామిడి బీటు నుంచి అక్రమంగా కలపను తరలించేందుకు వ్యాపారులు ఫేక్ చలానా సంపాదించారు. నర్సీపట్నం అటవీశాఖ అధికారులు చీడిగుమ్మల చెక్‌పోస్టు వద్ద ఆ కలప వాహనాన్ని అడ్డగించి ఫేక్ చలానా గుర్తించారు. దీనిపై రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర శర్మ గతనెల 24న రాజవొమ్మంగి అటవీ క్షేత్రకార్యాలయంలో సమగ్ర దర్యాప్తు జరిపారు. రూ.7వేలకు ఫేక్ చలాన ఇచ్చింది రాజవొమ్మంగి అటవీక్షేత్ర కార్యాలయానికి చెందిన బడదనాంపల్లి బీట్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణ అని తేలడంతో అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదర్శంగా 'సంసద్' గ్రామాలు

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



మాట్లాడుతున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పక్కన కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: సంసద్ ఆదర్శ గ్రామీణ యోజనలో ఎంపిక చేసిన పల్లెలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సంసద్ ఆదర్శ యోజనలో తాను దత్తత తీసుకున్న గ్రామాల్లో అభివృద్ధిపై ఎంపీ సమీక్షించారు. తాగునీరు, విద్యుత్,రహదారులు,మురుగు కాల్వలు ,భవన నిర్మాణాలపై చర్చించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొయ్యూరు గ్రామంలో 6 పనులు,ముంచంగిపుట్టు మండలం సుజనకోటలో 15 పనులు, చింతపల్లి మండలం అంజలి శనివారంలో 15, తాజంగిలో మూడు, హుకుంపేట మండలం తడిగిరిలో మూడు, జీకే వీధి మండలం వంచులలో నాలుగు, పెదబయలు మండలం గంపరాయిలో ఒకటి, సీకరిలో రెండు , పాడేరు పంచాయతీలో 25 పనులు మంజూరు చేశామన్నారు. సీసీరోడ్లు,తాగునీరు,విద్యుత్ సౌకర్యం కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు, కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎంపిక చేసిన తొమ్మిది గ్రామాల్లో 74పనులను గుర్తించామని, ఆ పనులన్నీ పారదర్శకంగా చేపడతామన్నారు.ఎస్‌సీఏ, సీసీడీపీ, సీఎస్ఆర్,ఉపాధి హామీ పథకం నిధులతో ఆయా పనులు చేపడతామన్నారు.ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు రూ.120 కోట్లను మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు చేశామన్నారు.పూర్తిచేసిన పనులకు రూ.70కోట్లు చెల్లించినట్టు తెలిపారు జల్‌జీవన్ మిషన్‌లో మంజూరు చేసిన పనులకు టెండర్లు వెంటనే పిలిచి, పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖ జెడ్పీ సీఈవో రామ్మూర్తి,డీఆర్వో అంబేడ్కర్,డీపీవో కొండలరావు, జిల్లా వ్యవసాయ,ఉద్యానవనశాఖ అధికారులు నందు,రమేష్‌కుమార్,డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి,డీఈవో సలీమ్‌బాషా,గిరిజన సంక్షేమడీడీ కొండలరావు,ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ,డీఎల్‌పీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ సుమిత్ కుమార్



చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



మొక్క నాటుతున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చిత్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరు సమీపంలోని వంతాడపల్లి మామిడితోటలు, ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడి ప్రాంతంలో సోమవారం చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ చెత్తను ఏరివేయగా, పాడేరు ఎమ్మెల్యే చీపురుతో ఊడ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజంతో పర్యావరణాన్ని కాపాడవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ నిషేధంపై పర్యాటకులకు కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మన్యంలో కలుషిత వాతావరణం ఏర్పడుతోందని, ఇది ప్రమాదకర పరిణామమని అన్నారు. పర్యాటకులు పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని చెప్పారు. అనంతరం వంతాడపల్లి తోటలు,పాదాలు గుడి వద్ద ప్రజలకు,వ్యాపారులకు తడి,పొడి చెత్త బుట్టలను కలెక్టర్,ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవోలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి,డీఎఫ్‌వో వినోద్‌కుమార్,డీపీవో కొండలరావు,గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు,వంతాడపల్లి సర్పంచ్ మాదెల రమణమ్మ,తహసీల్దార్ వంజంగి త్రినాథనాయుడు, రేంజి అధికారి శ్రీనివాసరావు, మినుములూరు సచివాలయం కార్యదర్శి చిన్ని,మాజీ ఎంపీపీ ఎస్.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో..
అటవీశాఖ ఆధ్వర్యంలో కుమ్మరిపుట్టులోని ఏపీఆర్ కళాశాల ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు,ప్రజాప్రతినిధులతో మొక్కలు నాటే కార్యక్రమానికి డీఎఫ్‌వో వినోద్‌కుమార్ శ్రీకారం చుట్టారు.కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్,అరకు ఎంపీ గొడ్డేటి మాధవి.పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు,డీఎఫ్‌వో వినోద్‌కుమార్, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ,ఎంపీటీసీ సభ్యురాలు గిడ్డి విజయలక్ష్మి,డీపీవో కొండలరావు,డీఎల్‌పీవో కుమార్‌లు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి శ్రీనివాసరావు,తహసీల్దార్ త్రినాథనాయుడు,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు,సర్పంచ్‌లు గబ్బాడి చిట్టిబాబు, మాదెల రమణమ్మ,ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మకుమారి పాల్గొన్నారు.

అందరూ సేఫ్



శంకరరావుకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- లభ్యం కాని ఒకే ఒక్కరి ఆచూకీ
- నిలకడగా ప్రమాద బాధితుల ఆరోగ్యం
- పలు ఆస్పత్రుల్లో 8 మందికి చికిత్స
- మెరుగైన వైద్యం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒడిశా అధికారులతో నిరంతరం చర్చలు

సాక్షి, విశాఖపట్నం: యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఒడిశా రైలు ప్రమాదంలో విశాఖకు చెందిన ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారు. ఒకే ఒక్క ప్రయాణికుడి ఆచూకీ ఇంత వరకూ లభ్యం కాలేదు. ఒడిశాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 8 మంది ప్రయాణికులను రాష్ట్ర ప్రభుత్వం విశాఖకు తీసుకొచ్చి.. మెరుగైన వైద్యం అందిస్తోంది. స్వల్ప గాయాలతో బయటపడిన వారందరికీ ప్రభుత్వం తక్షణ సాయం కింద పరిహారం అందించింది. అయితే జనరల్ బోగీల్లో ప్రయాణించిన వారిలో ఎవరైనా ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారున్నారా అనే అంశంపై నిరంతరం ఒడిశా ప్రభుత్వ అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఇంతవరకూ కుటుంబ సభ్యుల నుంచి తమ వారి ఆచూకీ తెలియలేదన్న ఫోన్ కాల్ ఏపీ కంట్రోల్ రూమ్‌కు రాకపోవడంతో.. ప్రస్తుతం గుర్తు తెలియని మృతదేహాల్లో ఇక్కడి వారు ఎవరూ ఉండరని అంతా భావిస్తున్నారు. పెను విషాదాన్ని మిగిల్చిన ఒడిశా రైలు ప్రమాదానికి సంబంధించి ప్రయాణికుల ఆచూకీ తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది. జిల్లాకు చెందిన ప్రతి ప్రయాణికుడినీ సురక్షితంగా ఇళ్లకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం నిరంతరం పనిచేస్తోంది. ప్రమాదానికి గురైన కోరమండల్, యశ్వంత్‌పూర్ రైళ్లలో రిజర్వేషన్ కోచ్‌లలో మొత్తం 342 మంది విశాఖ నుంచి ప్రయాణం చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. వారి యోగక్షేమాలు తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. 10 మంది సిబ్బందితో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా.. ఆరుగురు మినహా అందరూ సురక్షితంగా ఉన్నట్లు గుర్తించారు. మరో ఎనిమిది మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో వారందరినీ.. ప్రత్యేక అంబులెన్స్‌ల ద్వారా విశాఖ తీసుకొచ్చారు. కేజీహెచ్, సెవెన్‌హిల్స్, క్యూ1, అపోలో, ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణి ఆస్పత్రుల్లో చేర్పించి.. మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వీరిలో సెవెన్‌హిల్స్‌లో చికిత్స పొందుతున్న లోకేష్, మిన్నీ దంపతులను వైద్యులు డిశ్చార్జ్ చేశారు. వారిని ప్రత్యేక వాహనంలో వారి స్వస్థలానికి అధికారులు పంపించారు. మిగిలిన ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

ఆ ఒక్కరూ ఎవరు.?
మొత్తం ప్రయాణికుల్లో ఆరుగురు ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డా.మల్లికార్జున, డీఆర్వో శ్రీనివాసమూర్తి ఒడిశా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. ఆరుగురు వివరాలను పంపించిన అధికారులు.. ఆయా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారితో మ్యాచ్ చేయాలని కోరారు. రైల్వే అధికారులు, ఒడిశా ఐఎఎస్ అధికారులు, వైద్య సిబ్బంది కలిసి వారి వివరాలు సేకరించారు. ఇప్పటి వరకు ఐదుగురు సురక్షితంగా ఉన్నట్లు గుర్తించామని జిల్లా అధికారులకు తెలిపారు. అయితే ఎవరెవరు సురక్షితంగా ఉన్నారు.. ఇంకా ఎవరి ఆచూకీ దొరకలేదన్న దానిపై స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. ఆ ఒక్కరు ఎవరు..? ఎక్కడ ఉన్నారు.. ఏ పరిస్థితుల్లో ఉన్నారనే వివరాల కోసం నిరంతరం శ్రమిస్తున్నామని వెల్లడించారు. రిజర్వేషన్ బోగీల్లో కాకుండా.. జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి వివరాలు మాత్రం ఎవ్వరికీ దొరకలేదు. ఈ బోగీల్లో ఉన్న వారిలో విశాఖకు చెందిన వారున్నారా లేరా అనే దానిపై స్పష్టత రాలేదు. ఇంతవరకూ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తమ వారు కనిపించలేదని ఫిర్యాదులు రాలేదన్నారు. దీన్ని బట్టి జనరల్ బోగీల్లో దాదాపు ఉమ్మడి విశాఖకు సంబంధించిన వారెవ్వరూ లేరనేది స్పష్టమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే విశాఖ వాసులంతా ఈ ఘోర ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడినట్లే..



ప్రభుత్వం అందజేసిన చెక్కులు చూపిస్తున్న మాధవరావు, భారతి

రైలు బాధిత కుటుంబ సభ్యులకు చెక్కుల అందజేత

మహారాణిపేట (విశాఖపట్నం): ఒడిశా రైలు ప్రమాద ఘటనలో గాయపడిన, మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రైలు ప్రమాదంలో గాయపడి విశాఖలోని కేజీహెచ్ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి.. ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మంత్రి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ రైలు ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి తనతో పాటు, ముగ్గురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్ అధికారులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. అధికారులతో కలిసి తాము 10 గంటల్లో ప్రమాద స్థలికి చేరుకున్నామని చెప్పారు. అధికారులు హుటాహుటినా రంగంలోకి దిగి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 342 బాధితులు ఉన్నారని గుర్తించారని చెప్పారు. వారిని భువనేశ్వర్‌లోని వివిధ ఆస్పత్రులకు తరలించినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో గురుమూర్తి అనే వ్యక్తి మాత్రమే మరణించారన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అభినందించారని తెలిపారు.

ఏయూలో 16 నుంచి యోగా సదస్సు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఏయూ యోగా కేంద్రం ఈ నెల 16, 17వ తేదీల్లో సదస్సు నిర్వహిస్తోంది. బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో జరిగే సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బెంగళూరుకు చెందిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ యోగిక్ సైన్సెస్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.తులసీరావు పాల్గొన్నారు.

మోదమ్మను దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



పూజ చేస్తున్న ప్రభాత్‌కుమార్ సింగ్, సీమాసింగ్

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రభాత్‌కుమార్ సింగ్, ఆయన సతీమణి సీమాసింగ్ సోమవారం దర్శించుకుని, కుంకుమార్చన చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం న్యాయమూర్తి దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్రపటం,ప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం,ఆలయ కమిటీ ప్రతినిధులు ఉప్పల రత్నం,కొట్టగుల్లి రామారావులు పాల్గొన్నారు.జస్టిస్ ప్రభాత్ కుమార్‌సింగ్, సీమాసింగ్‌లు మధ్యాహ్నం అరకులోయకు చేరుకున్నారు. టూరిజం అతిథిగృహం వద్ద వారికి అధికారులు ఘనస్వాగతం పలికారు.అనంతరం పర్యాటక ప్రాంతాలను, కాఫీమ్యూజియంను సందర్శించారు. గిరిజన మ్యూజియంలో గిరిజన కళాకృతులను తిలకించి, సరదాగా విల్లు ఎక్కుపెట్టారు. ప్రకృతి అందాలకు వారు ఫిదా అయ్యారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- రూ. కోటితో నిర్మించిన పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: జిల్లాలో పలు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని ఐ పోలవరం జంక్షన్ సమీపంలో సుమారు రూ.కోటితో నిర్మించిన పార్కును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో గిరిజన యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ పార్క్ నిర్వహణ బాధ్యత డ్వాక్రా మహిళలకు అప్పగించినట్టు తెలిపారు. నామ మాత్రపు రుసుంతో పర్యాటకులకు పార్క్‌లోకి ప్రవేశం కల్పిస్తారని తెలిపారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, డీఎఫ్‌వో నరేంద్రియన్, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సర్పంచ్‌లు కుంజం వెంకటలక్ష్మి, మంగా బొజ్జయ్య, వడగల ప్రసాద్, కోసు రమేష్‌బాబుదొర, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, వంశీ ,రూతూ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి పెద్దపీట

రాష్ట్ర ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి



అరకులోయ ఆప్కో వ్యాపార సముదాయాన్ని పరిశీలిస్తున్న ఛైర్మన్ చిరంజీవి

అరకులోయ రూరల్: చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింక విజయలక్ష్మితో కలిసి స్థానిక ఆప్కో వ్యాపార సముదాయాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన చేనేత రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూర్వవైభవం తీసుకొచ్చినట్టు తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బకాయిలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే తీర్చిందన్నారు. ఏళ్ల తరబడి మూతబడిన ఆప్కో వ్యాపార సముదాయలను పూర్తిగా తెరిచినట్టు చెప్పారు. స్థానిక ఆప్కో వ్యాపారసముదాయం భవనానికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. అన్నిరకాల చేనేత వస్త్రాలను ఇక్కడ అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

నిధుల స్వాహాపై విచారణ
స్థానిక ఆప్కో వ్యాపార సముదాయం సిబ్బంది రూ.10 లక్షలు స్వాహా చేసినట్టు తెలుసుకుని ఆరా తీశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెద్దం నర్సింగరావు, వైస్ ఎంపీపీ రామన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, నాయకులు రఘునాథ్,సుంద్ర, నర్సింగ్,తమన్న,నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గొడౌన్‌లో అగ్నిప్రమాదం

అనకాపల్లి టౌన్: కొప్పాకలోని బాణసంచా గొడౌన్‌లో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక అధికారులు, పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

ఫోన్ కొట్టు.. సేవలు పొందు

- అన్నదాత చెంతకే సేవలు
- మొబైల్ ద్వారా రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు




చింతపల్లిరూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వం మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పంటలకు సోకుతున్న తెగుళ్లతో సతమతమవుతున్న రైతులకు సలహాలు అందించేందుకు సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రైతు భరోసా కేంద్రాలతో పాటు ఇవి కుడా రైతులకు ఎంతో మేలు చేయనున్నాయి. ఇంటి నుంచే పంటలకు సోకిన తెగుళ్ల నివారణకు చేపట్టవలసిన చర్యలను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా 155251 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. కేంద్రం ద్వారా రైతులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన ప్రతి ఒక్కరికీ విలువైన సలహాలు, సూచనాలు అందిస్తుంది.ఈ అవకాశాలు అందిపుచ్చుకుంటే రైతులు మేలైన, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

లాభాలు ఇవీ

రైతు సమీకృత సమాచార కేంద్రాల ద్వారా రైతులకు ముఖ్యమైన సేవలు అందుతాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలు, వాటి మార్కెటింగ్ సదుపాయాలపై సూచనలిస్తారు. పంటలకు సోకే తెగుళ్ల నివారణ చర్యలు, మేలైన, నాణ్యమైన దిగుబడులు పొందేందుకు తీసుకోవలసిన చర్యలపై సలహాలు ఇస్తారు. సమాచార కేంద్రంలో శాస్త్ర విషయాలకు సంబంధించిన నిపుణలు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు.`రైతులకు క్లిష్టమైన సమస్యలు వచ్చినప్పుడు సంబంధిత పరిశోధన కేంద్రాల ప్రధాన శాస్త్రవేత్తలను సంప్రదిస్తే 24 గంటల్లో సందేహాలు నివృత్తి చేస్తారు.రైతులు అడిగిన ప్రశ్నల ఆధారంగా అవసరమైతే వారి ఫోన్‌లకు ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం పంపుతారు. టోల్ ఫ్రీ నంబర్‌కు (155251) సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేయవచ్చు. ఏ పంటలు ఎప్పుడు వేయాలి. విత్తనాల ఎంపిక, శుద్ధి, ఎరువుల వినియోగం, సస్య రక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ వంటి అంశాలపై సలహాలు అందిస్తారు.

రైతులకు సలహాలు



రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు సమీకృత రైతు సమాచార కేంద్రం ద్వారా ఉపయోగకరమైన సలహాలు పొందవచ్చు. టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే శాస్త్రవేత్తలు సలహాలు అందిస్తారు.గిరిజన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– టి.కన్నబాబు, వ్యవసాయ అధికారి,చింతపల్లి

పాము కాటుతో విద్యార్థి మృతి



కామేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

కొయ్యూరు: పాము కాటుతో ఓ విద్యార్థి మృతిచెందాడు. మండలంలోని నడింపాలెం ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న రూడా కామేశ్వరరావు(13) తన స్వగ్రామం బూదరాళ్ల పంచాయతీ గరిమండలో ఇంటి వద్ద ఆదివారం రాత్రి నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. బాలుడిని బతికించేందుకు తండ్రి బాలన్న ఎంత ప్రయత్నించినా ఫలితం లేపోయింది. ఉన్నత చదువులు చదవి కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో విష సర్పాలు, పురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ధ్వంసం చేసిన చెరకు తోటల పరిశీలన

చోడవరం: అన్నవరం రెవెన్యూ పరిధిలో అడవిపందులు ధ్వంసం చేసిన చెరకు తోటలను అటవీ అధికారులు సోమవారం పరిశీలించారు. పలువురు రైతులకు చెందిన మొక్క చెరకు తోటలను అడవి పందులు నాశనం చేయడంతో రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో చోడవరం సెక్షన్ అటవీ అధికారులు పరిశీలించారు. వాటిని తరిమేందుకు ప్రయత్నించగా, దాడి చేసేందుకు ప్రయత్నించాయని, భయంతో వెనక్కి వచ్చేశామని బాధిత రైతులు సింహాచలం, సత్యనారాయణ, చిట్టిబాబు వాపోయారు. పంట నష్టపరిహారానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తామని చోడవరం అటవీశాఖ సెక్షన్ డిప్యూటీ రేంజర్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు.

పోస్టల్ సేవలపై అవగాహన




చింతపల్లిలోని అవగాహన ర్యాలీలో ఎంపీపీ అనూషదేవి, పోస్టల్ శాఖ అధికారులు

అరకులోయ రూరల్: తపాలశాఖ బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అరకు సబ్ డివిజన్ ఐపీఓ ఉపేంద్ర చెప్పారు. మండలంలోని పెదలబుడు పంచాయతీలో తపాల శాఖ వన్ జన్‌ధన్ యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలు ఖాతాలను తెరిపించి, అకౌంట్ పుస్తకాలను అందజేశారు. సర్పంచ్ దాసు బాబు, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: తపాల శాఖ బీమాను గిరిజనలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఎస్‌పీవో జనపాల ప్రసాద్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన వన్‌జన్‌ధన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తపాలశాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు తపాల శాఖ బీమాలు, పథకాలు గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇతర ఇన్సూరెన్సు కంపెనీలతో పోల్చుకుంటే తపాలశాఖ బీమాల్లో ప్రజలకు అధిక లాభాలు చేకురుతాయన్నారు. ఇందులో భాగంగా పాలసీదారుడు ప్రమాదవశాత్తు మరణించిన, అంగవైకల్యం చోటుచేసుకున్న అతనికి రూ.10లక్షల బీమా అందుతుందన్నారు. పోస్టల్ పేమెంట్ బ్యాంకు ద్వారా ఖాతాదారుడు ఇంటి వద్దకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల సొమ్మును పొందవచ్చన్నారు. ఐపీపీబీలో రూ.175తో ఖాతా తేరిస్తే ఆ ఖాతాదారునికి ఎటువంటి సంవత్సరిక చార్జిలు వర్తించవన్నారు. ఎంపీపీ అనూషదేవి, సర్పంచ్ దురియా పుష్పలత, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, పైలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



ఏఎల్‌పురం(కృష్ణదేవిపేట)లో అల్లూరి పార్కులో మొక్కలు నాటుతున్న దృశ్యం

గొలుగొండ: ప్రతి గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అనకాపల్లి జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పి. శ్రీనివాసరావు, నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, కృష్ణదేవిపేట రేంజర్ వెంకట్రావు తెలిపారు. సోమవారం ఏఎల్‌పురంలోని అల్లూరి సీతారామరాజు పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ మెరుగునకు ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద, గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. పర్యావరణంలో సమతుల్యత లోపించడం వల్లే అనేక ఇబ్బందులు వస్తున్నట్లు చెప్పారు. అటవీశాఖ, అధికారులు, నాయకులు మొక్కలు నాటే కార్యక్రమంపై శ్రద్ధ వహించాలని కోరారు. కృష్ణదేవిపేట డిప్యూటీ రేంజర్ రాజేష్, గొలుగొండ అటవీ శాఖ సెక్షన్ అధికారి లక్ష్మణ్, ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, స్థానిక సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు బుల్లిప్రసాద్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆత్మహత్య

ఎస్.రాయవరం: ఫ్యానుకు ఉరేసుకుని అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ లాం జనిత్ (21)ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ ప్రసాదరావు సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చోడవరానికి చెందిన లాం మనోహర్ మూడో కుమారుడు లాం జనిత్ ఎస్.రాయవరం పోస్టాఫీస్‌లో ఏబీపీఎంగా పనిచేస్తూ అక్కడే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శనివారం స్వగ్రామం చోడవరం నుంచి ఎస్.రాయవరం వచ్చి విధుల్లో చేరుతున్నట్టు కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఆదే రోజు సాయంత్రం నుంచి ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానం లేదు. సోమవారం ఉదయం ఇంటి ఓనర్‌కు ఫోన్ చేయగా, వాహనం ఇంటి వద్ద ఉందని, కిటికీ నుంచి దుర్వాసన వస్తున్నట్టు చెప్పడంతో వారు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందినట్టు గుర్తించారు. స్థానికులు సహాయంతో తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. తమ కుమారుడు ప్రేమ వ్యవహారంలో విఫలమై, మానసిక ఒత్తిడికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని, మృతి పట్ల ఎటువంటి అనుమానాలు లేవని అతడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బాధితులకు అండగా ప్రభుత్వం



విద్యుత్ ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: బాధితులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని, అన్ని విధాలుగా సాయం అందజేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఎల్లవరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పంపిణీ చేశారు. ఈ మేరకు రంపచోడవరం నియోజకవర్గం వ్యాప్తంగా 11 మండలాలకు చెందిన 25 మంది బాధితులకు ప్రభుత్వం ద్వారా సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి. అడ్డతీగల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నియామకమైన సిబ్బందికి నియామక పత్రాలను అందజేశారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండలం చట్లవాడ పంచాయతీ పరిధిలోని బొజ్జలగొంది గ్రామానికి చెందిన సాదల అబ్బాయిరెడ్డి ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో తీవ్ర గాయపడి రెండు కాళ్లు పోగోట్టుకుని, నడవలేని స్థితిలో ఉన్నాడు. పేద కుటుంబం కావడంతో వైద్య సేవలకు ఇబ్బంది పడుతున్న వారి పరిస్థితిని తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే ధనలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కును ఎల్లవరంలో జరిగిన కార్యక్రమంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు అబ్బాయిరెడ్డి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, సర్పంచ్‌లు కొండ జాకబ్, దూడ ప్రేమలత, కో–ఆప్షన్ సభ్యుడు ధర్మరాజు, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి గంగరాజు, నాయకులు ప్రేమ్ కుమార్, సుందర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు స్థానచలనం

తుమ్మపాల: జిల్లాలో పలు మండలాల తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాతవరం తహసీల్దార్ పి.కనకారావును పరవాడకు, పరవాడ తహసీల్దార్ వి.ప్రకాష్‌రావును మునగపాకకు, బుచ్చెయ్యపేట తహసీల్దార్ ఎస్.వి.అంబేద్కర్‌ను నక్కపల్లికి, రోలుగుంట తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావును బుచ్చెయ్యపేటకు బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన తహసీల్దార్ ఎస్.జానకమ్మను కోటవురట్లలో, విశాఖపట్నం ల్యాండ్ ఆక్విజిషన్ ప్రత్యేక తహసీల్దార్ జె.తారకేశ్వరిని రోలుగుంట తహసీల్దార్‌గా నియమించారు. డిప్యుటేషన్లపై వివిధ విభాగాల్లో విధుల్లో కొనసాగుతున్న అనకాపల్లి రెవెన్యూ డివిజన్ ఏవో సీహెచ్ చంద్రశేఖర్‌రావును, కలెక్టర్ కార్యాలయం అడ్మిన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావును, రీసర్వే ఓఎస్డీగా ఉన్న వై.వి.ఎస్.ఎస్.ప్రసాదరావును, అనకాపల్లి తహసీల్దార్ పి.వి.ఎల్.ఎన్.గంగాధరరావును వారి స్థానాల్లోనే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సచివాలయం ఉద్యోగికి పీవో అభినందనలు



ఐటీడీఏ పీవో అభిషేక్‌ను కలిసిన సచివాలయం ఉద్యోగి గోపి

అనంతగిరి: ఐటీడీఏ పీవో అభిషేక్‌ను సోమవారం అనంతగిరి మండలం రొంపల్లి సచివాలయం ఉద్యోగి కొర్రా గోపి, పాడేరులో మర్యాదపూర్వకంగా కలిశాడు. గతనెలలోని బెంగుళూరులో జరిగిన ప్రపంచస్థాయి 10కె మారథాన్ పోటీలల్లో గోపి పాల్గొని, 21వ స్థానంలో నిలిచాడు. ఈ నేపథ్యంలో గోవాలో డిసెంబర్‌లో జరగనున్న ఆల్ ఇండియా మారథాన్ పోటీలకు గోపి ఎంపికయ్యాడు. బెంగుళూరులో జరిగిన మారథాన్ పోటీలకు వెళ్లేందుకు, ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రోత్సహించారు. ప్రపంచస్థాయి మారథాన్ పోటీల్లో ఉత్తమప్రతిభను కనబరిచిన, ఆల్ అవర్ ఇండియా మారథాన్ పోటీలకు ఎంపికైనా కొర్రా గోపిని, ఐటీడీఏ పీవో ప్రశంసించి, అభినందించారు.

పర్యాటక ప్రాంతాల్లో సమస్యలపై వినతి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి

దుంబ్రిగుడ: పర్యాటక ప్రాంతాలు, మండల కేంద్రాల్లో వారపు సంతల్లో ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతూ అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి సోమవారం పాడేరులోని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సందర్శిత ప్రాంతాలు, వారపు సంతల్లో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణంతో పర్యాటకులు, గిరిజనులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించి, ఆయా ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి అధికారుల ద్వారా అంచన విలువతో కూడిన ప్రతిపాదనలు చేసిన వెంటనే నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు.

పశువుల పాక దగ్ధం

- ఆవు మృతి

మునగపాక: మండలంలోని చెర్లోపాలెంలో పశువుల పాక దగ్ధమైంది. సోమవారం జరిగిన ఈ ఘటనలో ఆవు మృతి చెందింది. రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. తనకు న్యాయం చేయాలంటూ బాధిత రైతు దవులూరి కొండమ్మ అధికారులను కోరుతున్నారు.

13 కేసుల్లో పట్టుకున్న గంజాయికి తూనిక

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 13 కేసుల్లో పట్టుకున్న గంజాయికి సోమవారం తూనిక వేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీనివాసరావు ఇక్కడ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 కేసుల్లో 308 కేజీల గంజాయి తూనిక వేశామన్నారు. వివిధ కేసుల్లో పట్టుకున్న గంజాయిని పోలీస్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో త్వరలో తగులబెడతామన్నారు.

నేడు మాడుగుల మోదమ్మ పండగ

- భారీ స్థాయిలో ఏర్పాట్లు
- పెద్ద ఎత్తున రానున్న భక్తజనం
- ఆకట్టుకుంటున్న సురభి నాటక ప్రదర్శనలు



మోదకొండమ్మకు ఆభరణాలతో అలలంకరణ



ముస్తాబయిన అమ్మవారి ఆలయం

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భాసిల్లుతున్న మాడుగుల మోదకొండమ్మ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఇక్కడ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా వాసులతోపాటు విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. క్యూలైన్లు, మంచినీరు తదితర ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.


పలు సాంస్కృతిక కార్యక్రమాలు...

అమ్మవారి ఆలయం నుంచి శతకంపట్టు వరకు కళ్లు మిరమిట్లు గొలిపే విధంగా విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఇక్కడ మహరాజుల కోటలో హైదరాబాద్ వారి సురభి నాటకాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం సాయంత్రం భక్త ప్రహ్లాద నాటకాన్ని ప్రదర్శించనున్నారు. వీటితోపాటు డ్యాన్స్ హంగామా, సినీ నృత్య ప్రదర్శనలు, చిత్ర విచిత్రమైన నేల వేషాలు నడుమ అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు గ్రామంలో ఊరేగించి తిరిగి ఆలయానికి చేరడంతో అమ్మవారి నెల రోజుల పండగ పూర్తవుతుంది. మహిళా కళాకారులుతో డప్పు వాయిద్యాలు, కేరళ డమరుక నాదాలతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

120 మంది పోలీసులతో గట్టి బందోబస్తు

అనకాపల్లి డీఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ దామోదరనాయుడు ఆధ్వర్యంలో 120 మంది పోలీసు బందోబస్తు నడుమ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆలయానికి కిలోమీటరు మేర దూరంలో కార్లు, బైక్‌లు నిలుపుదల చేయడానికి వేంకటేశ్వర ఆలయ ప్రాంగణం సిద్ధం చేశారు. ఆర్టీసీ బస్సులకు స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి



మాడుగుల మోదకొండమ్మ పండగను అందరి సహకారంతో నిర్వహిస్తున్నాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీతోపాటు పోలీసులకు భక్తులు సహకరించాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

– పుప్పాల అప్పలరాజు, ఆలయ కమిటీ చైర్మన్, మాడుగుల